క్లుప్తంగా

యోగ సాధనతో ప్రయోజనాలు

వైవీయూ : యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సన్నాహక శిక్షణలో భాగంగా రెండో రోజు మంగళవారం కళాశాలలో యోగ శిక్షణ నిర్వహించారు. యోగ గురువు ఆదినారాయణ ఆసనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. అంకాల్ నాగరాజు, డా. వై. సావిత్రి, డా. శివరామకృష్ణ, హజరతయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి

వైవీయూ : ఉద్యోగసాధనకు అవసరమయ్యే కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌లో పట్టు సాధించి ఉద్యోగసాధనలో ముందుండాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ సూచించారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉన్నతి ఫర్ నెక్ట్స్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలపై కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో వర్క్‌షాపు నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అకడమిక్ అంశాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నతి ఫౌండేషన్ ప్రతినిధులు కె. శ్రీనివాసులు, ఎస్. సుషిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైవీయూలో పీజీ తరగతులు ప్రారంభం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పీజీ కళాశాలలో విద్యార్థులకు తరగతులు ఈనెల 19న ప్రారంభమయ్యాయని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తెలిపారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు తరగతులకు రెగ్యులర్‌గా హాజరుకావాలని సూచించారు. విద్యార్థుల కోసం వసతిగృహాలు సైతం అన్ని రకాల సౌకర్యాలతో సిద్ధంగా ఉంచామన్నారు. తరగతులకు హాజరుకాని విద్యార్థులు విలువైన పాఠ్యాంశాలను నష్టపోతారని పేర్కొన్నారు.

సరుకులు పంపిణీ

కడప సిటీ : ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ సెక్రటరీ దివంగత వై.తారకనాథ్ సేవలు మరువలేనివని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ (అమరావతి సర్కిల్) అధ్యక్షులు కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తారకనాథ్ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కడపలోని స్టేట్ బ్యాంకు స్థానిక శాఖలు కలిసి పద్మావతి వృద్ధాశ్రమం, బృంద వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ కడప ప్రాంతీయ మేనేజర్ నారాయణ రావు, ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి సంజీవ్ ఆనంద్‌కుమార్, ఎస్‌బీఐ ప్రధానశాఖ స్థానిక కార్యదర్శి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మంచి నడవడికతో జీవించాలి



కడప వన్‌టౌన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ షరీఫ్

కడప అర్బన్ : సత్ప్రవర్తనతో జీవించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. మంగళవారం కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అటెండర్ కుటుంబానికి ఆర్థికసాయం



అటెండర్ ప్రసాద్ భార్యకు నగదును అందచేసిన సీఈఓ రాజేంద్రప్రసాద్

కడప అగ్రికల్చర్ : అన్నమయ్య జిల్లా నందలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో అటెండర్‌గా పనిచేస్తూ ఆకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందిన ప్రసాద్ కుటుంబానికి డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్, యూనియన్ నాయకులు ఆర్థిక సాయాన్ని అందచేశారు. సీఈఓ పిలుపు మేరకు కడప డీసీసీ బ్యాంకులోని సిబ్బంది అందరూ రూ. 88,000 అందచేశారు. ఈ మొత్తాన్ని మంగళవారం సీఈఓ కందుల రాజేంద్రకుమార్, యూనియన్ నాయకులు రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజంపేట డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రాజేష్, నందలూరు సొసైటీ ప్రదీప్ తదితరులు ప్రసాద్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు నగదును అందచేశారు.

రేపు క్రీడా ఎంపికలు

కమలాపురం : స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కొరకు గురువారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయం వద్ద క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నామని ఎంఈఓ జాఫర్ సాదిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 4, 5వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరు కావాలన్నారు.

తడిచెత్తతో ఎరువుల తయారీ



మైక్రో కంపోస్టింగ్ సెంటర్ (నమూనా చిత్రం)



పల్వరైజింగ్ మెషీన్

- నగరంలో 4 మైక్రో కంపోస్టింగ్ సెంటర్లు
- ఒక్కోదానికి రూ.50 లక్షల వ్యయం.. 5 మెట్రిక్ టన్నుల సామర్థ్యం
- పొడిచెత్తను రీసైకిల్ చేసేందుకు చర్యలు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో వెలువడుతున్న తడి చెత్తతో ఎరువులు తయారు చేసే దిశగా కడప నగరపాలక సంస్థ అడుగులు వేస్తోంది. ప్రతిరోజూ 5 మెట్రిక్ టన్నుల ఎరువును తయారు చేసే విధంగా ఒక్కొక్క కంపోస్టింగ్ సెంటర్‌ను రూ. 50లక్షలతో నిర్మించాలని తీర్మాణించారు. ఈ మేరకు రూ.2 కోట్ల వ్యయంతో నాలుగు మైక్రో కంపోస్టింగ్ సెంటర్లు నిర్మించేందుకు రంగం సిద్ధమైంది. కడప నగరంలో ప్రతిరోజూ సుమారు 200 టన్నుల తడి, పొడి చెత్త ఏర్పడుతోంది. ఈ చెత్తను కొలుముల పల్లె వద్ద నున్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ చెత్తనంతా అక్కడ వేయడం వల్ల కొన్నేళ్లకు ఆ డంపింగ్‌యార్డు చెత్తతో నిండిపోయే ప్రమాదం ఉంది. ఆ తర్వాత చెత్త వేసేందుకు స్థలం ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజూ వెలువడే చెత్తను తడి, పొడిగా విభజించి, తడిచెత్తను సూక్ష్మ ఎరువుగా మార్చడం వల్ల నగం చెత్తను తగ్గించవచ్చనే ఆలోచనకు వచ్చారు. ఈ చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించకుండా మైక్రో కంపోస్టింగ్ చేస్తారు. సుమారు 100 మెట్రిక్ టన్నుల తడిచెత్తను మైక్రో కంపోస్టింగ్ చేయడానికి 25 మైక్రో కంపోస్టింగ్ సెంటర్లు అవసరం కాగా, ప్రస్తుతం నాలుగు మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం చెన్నై నగరపాలక సంస్థలో ఈ తరహా పద్ధతిని అనుసరిస్తున్నట్లు సమాచారం. మైక్రో కంపోస్టింగ్ సెంటర్లలో తయారైన ఎరువును విక్రయించడం ద్వారా నగరపాలక సంస్థకు ఆదాయం కూడా లభించే అవకాశం ఉంది.

కడప నగరాన్ని ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ జోన్లుగా విభజించిన నేపథ్యంలో ప్రతి జోన్‌లోనూ ఒక మైక్రో కంపోస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి మైక్రో కంపోస్టింగ్ సెంటర్‌లో ఆర్గానిక్ ష్రెడ్డింగ్ మిషన్, పల్వరైజింగ్ మెషీన్ కొనుగోలు చేసేందుకు మరో రూ.50లక్షలు వినియోగించనున్నారు.

పొడిచెత్త స్వీకరణకూ సెంటర్లు

పొడిచెత్తను స్వీకరించేందుకు కూడా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంఆర్ఎఫ్(మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ) సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇంటింటి నుంచి స్వీకరించే వాటర్ బాటిళ్లు, చెప్పులు, అట్టపెట్టెలు, సంచులు, చెక్కలు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు వంటి వాటిని ప్రత్యేకంగా స్వీకరించి ఒకచోటికి చేరుస్తున్నారు. ఇలా రోజుకు 30 టన్నుల పొడిచెత్తను సేకరించాలనే లక్ష్యంగా నిర్ణయించారు. వీటిని రీసైకిల్ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఉత్సాహంగా క్రీడా ఎంపికలు



విద్యార్థుల వివరాలను నమోదు చేసుకుంటున్న శాప్ సిబ్బంది

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికారసంస్థ మైదానంలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి క్రీడాఎంపికలకు క్రీడాకారుల నుంచి స్పందన లభించింది. కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 4వ తరగతి, 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంపికలకు కడప మండల పరిధి నుంచి 27 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 6గురు బాలికలు, 21 మంది బాలురు ఉన్నారు. ఈ ఎంపికలను స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, కడప మండల విద్యాశాఖాధికారి పాలెం నారాయణ విచ్చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల ఎత్తు, బరువును అధికారులు కొలిచారు. అనంతరం శిక్షకుల ఆధ్వర్యంలో 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగుపందెంలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఎంపికల ప్రక్రియను డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ పర్యవేక్షించారు.

ఆర్ఐఓ కార్యాలయం వద్ద ధర్నా

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందచేయాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం కడప ఆర్ఐఓ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇంకా ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయలేదన్నారు. ఇంటర్ పుస్తకాలు కావాలనే వారు బోర్డుకు రూ. 1200 చెల్లించాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీవీఈఓ శ్రీనివాసులరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, కుమార్, శివశంకర్, జిల్లా సమితి నాయకులు వర్ధన్ పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యానేరమని సహాయ కార్మికశాఖ అధికారి పాల్ జాన్సన్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని కృష్ణా సర్కిల్, డీసీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రతి షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యజమానులు బాల కార్మికులతో పనిచేస్తే చట్టరీత్యా నేరమవుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఆయా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ పారా లీగల్ వలంటీర్ సురేష్ సహాయం, కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

22న పురస్కారాలు ప్రదానం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో 950 మార్కులు ఆపైన సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రముఖ విద్యాసంస్థ మాస్టర్‌మైండ్స్ యాజమాన్యం 22వ తేదీన కడపలోని అపూర్వ కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలను అందచేయనున్నట్లు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసే విద్యార్థులు వారి గుర్తింపుకార్డు, కాలేజీ ఐడికార్డు, సీనియర్ ఇంటర్ పరీక్షల్లో సాధించిన మార్కుల జాబితా తీసుకుని రావాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు తమ పేర్లను, 9248722218, 7780390139 నెంబర్‌లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. హాజరైన విద్యార్థులకు ప్రతిభ పురస్కారంతోపాటు సర్టిఫికెట్, నగదు బహుమతిని అందచేయనున్నట్లు వారు తెలిపారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ

కడప స్పోర్ట్స్: చెన్నై నగరం రాయపేటలో 18వ తేదీన నిర్వహించిన రోటరీక్లబ్ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో కమలాపురం పట్టణానికి చెందిన భగదీశ్వర్‌రెడ్డి చక్కటి ప్రతిభ కనబరిచాడు. అండర్-14 విభాగంలో పాల్గొని 9 రౌండ్లకు ఐదున్నరపాయింట్లు సాధించి 8వ స్థానంలో నిలిచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారీ తెలిపారు.

పెంచిన చార్జీలు ఉపసంహరించుకోవాలి



సంఘీభావం తెలుపుతున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నదని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలపై భారాలను మోపుతున్నదన్నారు. పీక్స్, కస్టమర్, సర్ చార్జీల పేరుతో విద్యుత్ సుంకం అనే పేరుతో ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. దేశంలోని బొగ్గు గనులు, ఇతర ప్రకృతి సంపదను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. ఈ నెల 30న సబ్ స్టేషన్ల ఎదురుగా మహాధర్నాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు రామ్మోహన్, అంకన్న, రమణయ్య, చంద్రారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువల్లో పూడిక తీయాలి



కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు సమస్యలు వివరిస్తున్న 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మురికి కాలువల్లో పూడిక తీయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నాగరాజుపేట, అల్మాస్‌పేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజుపేటలో పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికలను పరిశీలించారు. సచివాలయ సెక్రటరీలు తప్పనిసరిగా యూనిఫాం, ఐడీ కార్డులు ధరించాలని సూచించారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి బుగ్గవంక వరకూ ఉన్న మురికి కాలువలో పూడిక తీయాలని ఆదేశించారు. బుగ్గవంక రోడ్డు నందు ఉన్న రాజీవ్‌గాంధీనగర్‌లో సీసీ కాలువ నిర్మించేందుకు అంచనాలు తయారు చేయాలన్నారు. ఏజీ అండ్ పి గ్యాస్ పైపులైన్ కోసం తవ్విన రోడ్లను మరమ్మతులు చేయాలన్నారు. జిల్లా కోర్టు, మున్సిపల్ కార్యాలయం నుంచి బుగ్గవంకకు వెళ్లే డ్రైన్‌ను పరిశీలించి, నీటి ప్రవాహం సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాగరాజుపేటలో మున్సిపల్ హైస్కూల్ నందు నీటి కోసం బోరు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఫ్యాప్టో కడప జిల్లా సెక్రటరీ జనరల్ షేక్ మొహమ్మద్ ఇర్షాద్, యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్‌లు డిమాండ్ చేశారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు మేరకు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించే రెండవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధను కడపలోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు, బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రబాబు, హరికొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు ప్రీ స్కూలు కిట్స్ అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అర్బన్ పరిధిలోని నకాష్ 1, 5 అంగన్వాడీ కేంద్రాలకు బాలాజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పి.కృష్ణకిశోర్‌రెడ్డి ప్రీ స్కూలు కిట్స్‌ను అందజేశారు. మంగళవారం ఆయా అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి ఆయన సీడీపీఓ సునందకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో పిల్లలకు సంబంధించి రెయిమ్స్, కథలు ఆడియో ద్వారా ఎనిమిది భాషల్లో వినిపించవచ్చన్నారు. ఈ కిట్‌ను అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకున్నట్లయితే మరికొన్ని కేంద్రాలకు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్ సరోజమ్మ, మహిళా సంరక్షణ కార్యకర్త జ్యోత్స్న, అంగన్వాడీ కార్యకర్తలు మెర్సీ, తులసి, హెల్పర్లు, తల్లులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచిత సేవలు అందిస్తున్నారు. ఏపీ ఉన్నతవిద్య ఆధ్వర్యంలో డిగ్రీలో ప్రవేశాల కోసం ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదుచేసుకోవాల్సి ఉన్న నేపథ్యంలో విద్యార్థుల కోసం ఉచిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఫీజు లేకుండా పూర్తి ఉచితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డా. ఆర్. నీలయ్య, అధ్యాపకులు మనోహర్‌రెడ్డి, డా. రాజ్‌కుమార్‌బాబు, డా. సుధాకర్‌రెడ్డి, నాగభూషణరాజు, సంపత్‌కుమార్‌రాజు, లావణ్య, వెంకటశృతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

• కడప రాయునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత కడపరాయుడు

కడప కల్చరల్ : తిరుమల తొలిగడప దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామికి విశేష పూజలు నిర్వహించారు. తొలుత శ్రీదేవి భూదేవి సమేత స్వామి ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. కనుల పండువగా పూలు, సువర్ణ ఆభరణాలతో అలంకరించి పల్లకీపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. ఇరువైపులా చిద్విలా సమూర్తులైన శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో స్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాల మధ్య స్వామి తమ ఇళ్ల ముంగిటకే తరలి రావడంతో భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు తివిక్రమ్, కృష్ణమోహన్‌ల పర్యవేక్షణలో పూజలు నిర్వహించగా కార్యక్రమాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి నిర్వహించారు.

• కాపాడు తల్లీ.. విజయదుర్గమ్మా..



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారంలాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు.

నేడు నగరంలో యోగా డే

కడప కల్చరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధాన కార్యక్రమాన్ని మున్సిపల్ స్టేడియంలో ఉదయం 6.30 నుంచి 8.00 గంటల వరకు చేపట్టనున్నారు. జిల్లాకు చెందిన ప్రధాన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అతిథులుగా హాజరు కానున్నారు. ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.

కడప శిల్పారామంలో సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 6.30 నుంచి 8.00 గంటల వరకు సందర్శకులతో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పాలనాధికారి పి.శివప్రసాద్ రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు.

కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు భక్తులచే యోగా ప్రదర్శన నిర్వహింపజేయనున్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల ముగింపు ఉత్సవంలో భాగంగా సభ్యులచే యోగా సాధన చేయనున్నారు. ఆర్టీసీ వర్క్‌షాప్‌లోనూ, అటవీశాఖ ఆధ్వర్యంలోనూ ప్రత్యేకంగా యోగా ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైద్య సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్

కడప అర్బన్ : కడప కేంద్రకారాగారంలో వున్న ఖైదీలందరూ మూడు రోజుల పాటు దీర్ఘకాలిక వ్యాధులకు నిర్వహించే వైద్య పరీక్షలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్‌బాబు అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వల్లీ ఆధ్వర్యంలో కడప కేంద్రకారాగారంలో వున్న ఖైదీలందరికీ దీర్ఘకాలిక వ్యాధులైన హెపటైటిస్-బి, -సి, సిఫిలిస్, హెచ్ఐవి, టి.బి పైన అవగాహనతో పాటు, వైద్య పరీక్షలను ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఖైదీలకు దీర్ఘకాలిక వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కడప కేంద్రకారాగారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ ఖైదీలందరూ పరీక్షలను తప్పక చేయించుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ వి. భాస్కర్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసం, యోగా, వైద్య పరీక్షల ప్రాముఖ్యత, రక్తంపై అవగాహన కల్పించారు. తరువాత ఖైదీలందరికీ డాక్టర్ ప్రవీణ్, సుదర్శన్ రెడ్డిలు పరీక్షల ఆవశ్యకతను తెలియజేశారు.

యోగా గురువులకు సత్కారం



యోగా మాస్టర్లను సత్కరిస్తున్న షబ్బీర్

కడప కల్చరల్ : కడప నగరంలోని మౌలాన ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం యోగా గురువులను ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సొసైటీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సీనియర్ యోగా థెరపిస్టు, మిత్ర యోగా సెంటర్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, పద్మ యోగా సెంటర్ మాస్టర్ పద్మావతిలను తమ కార్యాలయానికి ఆహ్వానించి సత్కరించారు. డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూలు స్పెషల్ ఆఫీసర్ బాషా మోహిద్దీన్, సీఆర్ఐ సుబ్బారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు సీఆర్ఐ సునీల్ జయంత్, దినేష్‌కుమార్, జిల్లా బ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షులు లక్ష్మీదేవి అతిథులుగా హాజరై యోగా గురువులను సత్కరించారు.

గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి



సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : స్థానిక గ్రామపంచాయతీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశాని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన చెన్నూరులో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి మాట్లాడారు. రూ.కోటితో సిమెంట్ రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే డ్రైనేజీ పనులు పూర్తి కాగా, కొత్త రోడ్డు మీద నుంచి వనం వీధి వరకు రూ.34 లక్షలతో 4 వందల మీటర్లు (డీఎంఎఫ్) డిస్ట్రిక్ జనరల్ ఫండ్ ద్వారా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. చెన్నూరు అరుంధతినగర్ వద్ద డ్రైనేజీ, రాజులకాలనీ నుంచి బెస్త కాలనీ వరకు డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికి ఉచితంగా కులాయి కనెక్షన్ ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆర్‌వీఆర్, సీనియర్ నాయకులు, జయభారత్‌రెడ్డి పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చాపాడు: మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై రచించిన 'మూడు తరాల ప్రజా సారథి' పుస్తకాన్ని మంగళవారం స్థానిక కశెట్టి కళ్యాణ మండపంలో అన్ని వర్గాల అధిరథులచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే రాజకీయ జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బ్రహ్మంగారి మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, పీవీ రమణారెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.